# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-08-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కడపలో అవొకాడో సాగు చేస్తున్న రైతు వరదరాజును ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కి బాత్ 137వ కార్యక్రమంలో అభినందించారు.**

2. **భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.**

3. **పండుగల సమయంలో 'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.**

4. **మార్కాపురం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించనున్నారు.**

==========================

అవకాడో సాగు రైతులకు ఆదాయాన్ని పెంచే కొత్త అవకాశాలను అందిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన్ కి బాత్, మనసులోని మాట కార్యక్రమం 137వ సంచికలో తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా ఈరోజు ఆయన దేశ ప్రజలతో పంచుకున్నారు. అవకాడోకు ప్రస్తుతం ఆరోగ్యపరమైన ప్రయోజనాలు, ప్రీమియం మార్కెట్లలో పెరుగుతున్న ఆదరణతో ప్రాధాన్యం పెరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన రైతు వరదరాజు ఉదాహరణను ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. అవొకాడో పంటపై ఆసక్తితో యూట్యూబ్ ద్వారా సాగు పద్ధతులపై అవగాహన పొందిన వరదరాజు ఇప్పటివరకు సుమారు నాలుగు టన్నుల దిగుబడి సాధించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' ఉద్యమంలో యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం సంతోషకరమని మన్ కీ బాత్‌లో తెలిపారు. మత్తు రహిత జీవితం సందేశాన్ని సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని యువ సంగీతకారులు, విద్యార్థులు, నాటక బృందాలు, కంటెంట్ క్రియేటర్లకు పిలుపునిచ్చారు. తమ ప్రయత్నాలను 'మత్తురహిత యువత' హ్యాష్‌ట్యాగ్‌తో

సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచిస్తూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

పి.ఎం. స్వనిధి పథకం ద్వారా లక్షలాది మంది మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పి.ఎం. స్వనిధి పథకం పురోగతిపై మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. మహిళలకు పి.ఎం. స్వనిధి పథకం అండగా నిలుస్తోందన్నారు. ఈ పథకం లబ్ధిదారుల్లో దాదాపు 46 శాతం మంది మహిళలేనని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది ఈ పథకంతో అనుసంధానమై తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

పండుగల సమయంలో 'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సెప్టెంబర్‌లో రానున్న పండుగలపై మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి ప్రసంగించారు. సెప్టెంబర్ నాలుగున జన్మాష్టమి, అదే నెలలో విశ్వకర్మ పూజ జరుపుకోనున్న నేపథ్యంలో కళాకారులు, చేతివృత్తుల నిపుణులను గౌరవించాలని కోరారు. దీపావళికి కూడా ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' అంటే కేవలం మట్టి ప్రమిదలు కొనడం మాత్రమే కాదని, కొనుగోలు చేసే ప్రతి వస్తువు భారతదేశంలో తయారైందా అని పరిశీలించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

మార్కాపురం జిల్లాలో రేపు వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించే వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ముఖ్యమంత్రి ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నారని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు పశ్చిమ ప్రకాశంలో తీవ్రంగా ఉన్న ఫ్లోరైడ్ సమస్యకు కూడా ఉపశమనం కలగనుందని తెలిపారు.

---------------------------

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో 61 లక్షల 92 వేల 3 వందల 96 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 2 వేల 6 వందల 93 కోట్ల 90 లక్షల రూపాయలను విడుదల చేసినట్టు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా మంజూరైన 6 వేల 2 వందల 68 వితంతు లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం 2 కోట్ల 51 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు 441 శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 289 మందికి, పాఠశాలల్లో 152 మంది పిల్లలకు 2 కోట్ల 42 లక్షల రూపాయలు వెచ్చించి ఈ శస్త్రచికిత్సలు చేయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం శస్త్రచికిత్సల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 238 చికిత్సలు నిర్వహించగా, మిగిలినవి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంతో అనుసంధానమైన ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలకు శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు సూచించినప్పుడు కొందరు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారని, అలాంటి వారికి అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

---------------------------

జాతీయ చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు. చిన్న తరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి... యువతకు ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగు పరిచే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 30వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఆర్థికాభివృద్ధిలో చిన్న తరహా పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తున్నాయి. అందువల్లనే... చిన్న తరహా పరిశ్రమలకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా... వాటిని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది.

---------------------------

త్వరలో నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల కోసం మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ద్వారా ఈ శిక్షణ అందిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికకు రాష్ట్రస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రేపటి నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్- ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలపై అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి విస్తరించి ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================